న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయం ఎదురుగా వెలసి ఉన్న శ్రీ బేడి ఆంజనేయ స్వామివారికి ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. కార్తీక మాసం చివరి ఆదివారం సందర్భంగా ప్రతి సంవత్సరం ఆలయంలో ప్రత్యేక అభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆంజనేయ స్వామి ఆలయంలో మూలమూర్తికి ఉదయం పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపులతో విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. శ్రీవారి ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

భాకరాపేట : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీ ఈఆర్సీ) చైర్మన్ ఠాకూర్ రామ్ సింగ్ అన్నారు. ఆదివారం ఆయన భాకరాపేట సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని సబ్ స్టేషన్లలో వినియోగదారులకు అందించే విద్యుత్ సరఫరా నాణ్యతపై ఆరా తీశారు. మండలంలోని నెల్లట్లవారిపల్లె, భాకరాపేట సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ పరఫరాకు సరపడా ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం అని గుర్తించారు. జనవరి చివరికి నెల్లుట్లవారిపల్లె, ఫిబ్రవరి చివరిలోపు భాకరాపేట సబ్‌స్టేషన్‌లకు అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చాలని అధికారులకు సూచించారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడంలో జాప్యం జరగరాదని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ, డీఈ, ఏఈ, సబ్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ఈ గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో పాటు జిల్లా అధికారులు అంతా అందుబాటులో ఉంటారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వివిధ సమస్యల కోసం వచ్చే వారికి అవసరమైన మేరకు వసతులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రధానంగా తాగునీటి సౌకర్యంతో పాటు అర్జీదారులు కూర్చోవడానికి వీలుగా కుర్చీలను, అర్జీలు రాసి ఇవ్వడానికి వీఆర్వోలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. మరో వైపు వృద్ధులు సైతం తమ సమస్యలను చెప్పుకోవడానికి వీలుగా ముందుగా వచ్చిన వారు అధికారులను కలవడానికి వీలుగా ఏర్పాట్లు చేపట్టాల్సి ఉంది. అయితే అధికారులు ఒక వారంలో గ్రీవెన్స్ సందర్భంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. మరో వారం గ్రీవెన్స్‌లో వసతులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. అలా కాకుండా అన్ని వారాల్లో అర్జీదారులకు అవసరమైన మేరకు వసతులు కల్పించాలని జిల్లా వాసులు కోరుతున్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ పలుమార్లు మెరుగైన వసతుల ఏర్పాట్లపై ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. గ్రీవెన్స్ నిర్వాహకులు ఏమాత్రం చర్యలు చేపడుతారో సోమవారం చూడాల్సి ఉంది.



శ్రీవారి ఆలయంలో కార్తీక దీప శోభ

తేజోమయం

తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం సాయంత్రం కార్తీక పౌర్ణమి దీపోత్సవాన్ని టీటీడీ కన్నుల పండువగా నిర్వహించింది. ఈ కార్తీక పర్వ దీపోత్సవంలో మొదట శ్రీ యోగనరసింహస్వామి ఆలయం పక్కన 80 కొత్త మూకుళ్లతో దీపాలను వెలిగించారు. తదుపరి వీటిని ఛత్ర చామర, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా విమాన ప్రదక్షిణం చేస్తూ, ఆనంద నిలయంలో శ్రీవారికి హారతి ఇచ్చారు. ఆ తర్వాత స్వామివారి పుష్కరిణి వద్ద సుమారుగా వెయ్యి నేతి జ్యోతులను మంగళ వాయిద్యల నడుమ ఏర్పాటు చేశారు. కార్తీక దీపోత్సవం కారణంగా టీటీడీ పౌర్ణమి గరుడ సేవను రద్దు చేసింది. – తిరుమల



తిరుమల శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాని వెలిగిస్తున్న టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం

ఇది నీకు.. అది నాకు

క్వార్ట్జ గనుల్లో తమ్ముళ్ల దందా..

కూటమి నేతలకు అవినీతి అక్రమాలకు అడ్డే లేకుండాపోయింది. ప్రకృతిలోని కొండలు, గుట్టలు, చెరువులు, నదులు, వాగులు, వంకలు.. ఇలా వారి ధనదాహానికి కనుమరుగు అవుతున్నాయి. సైదాపురం మండలంలో అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి అండదండలతో కొందరు చోటామోటా నేతలు బృందంగా తెల్లరాయిని యథేచ్ఛగా అక్రమంగా తరలించి రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. ఇందుకు గానూ అధికారులకు, పార్టీ పెద్దలకు పెద్దమొత్తంలో మామూళ్లు అందుతుండడంతో అక్రమ దందా సాఫీగా సాగుతోంది.





అక్రమంగా ఖనిజ సంపదను తరలిస్తున్న లారీలు

సైదాపురం ఖనిజ సంపద కొల్లగొడుతున్న వైనం

- అనుమతులు లేకున్నా తెల్లరాయి తరలింపు
- గత 10 రోజుల్లోనే 15,000 వేల టన్నులకు పైగా తరలింపు
- కోట్ల రూపాయల మేర వెనుకేసుకున్న తమ్ముళ్లు
- కూటమి ప్రభుత్వంలో కొత్త పాలసీ పేరిట అన్ని మైనింగ్‌ల మూత
- టీడీపీలోని మంత్రి అనుచరుడి మైనింగ్‌కు మాత్రమే అనుమతి
- పార్టీ పెద్దలకు, అధికారులకు చేరుతున్న నెలవారీ మామూళ్లు
- ఫిర్యాదు చేసినా బుట్టదాఖలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: గత ఆర్నెళ్లుగా కూటమి నేతల అవినీతి అక్రమాలు, అన్యాయాలను చూసి జనం ఈసడించుకుంటున్నారు. కనిపించిన ప్రతి చోటా ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో సైదాపురం మండలం గత నెల రోజులుగా యథేచ్ఛగా తెల్లరాయిని తరలించి రూ.కోట్లు గడిస్తున్నారు. పాలక ప్రభుత్వం మైనింగ్ అనుమతులు నిలిపేసినా టీడీపీ నేతల తెల్లరాయి అక్రమ తరలింపు దందా మాత్రం ఆగడం లేదు. మండలం నుంచి ప్రతి రోజూ 50 లారీలకు పైగా తెల్లరాయి సంపదను అక్రమ మార్గంలో తరలించి జేబులు నింపుకుంటున్నారు. ఎవరి వాటాలు వారికి ఎప్పటికప్పుడు చేరుతుండడంతో మండలంలో ఖనిజ సంపద దందాకు అంతేలేకుండా పోతోంది.

సైదాపురం టు చెన్నై..

సైదాపురం మండలంలో 60 క్వార్ట్జ్ మైనింగ్‌లు ఉండగా కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్తపాలసీ పేరిట అన్నీ మూసేశారు. అయితే కూటమి పార్టీలోని మంత్రి అనుచరుడిగా చెలామణి అవుతున్న ఓ వ్యక్తి మైనింగ్‌కు మాత్రమే అనుమతిచ్చారు. ఈ మైనింగ్‌లో కూడా పల్స్‌పర్ ఖనిజాన్ని మాత్రమే తరలించేందుకు అనుమతి ఉండగా.. ఈ మాటున కొందరు తెల్లరాయిని, ఇతర రాష్ట్రాల పర్మిట్లతో ఈ ప్రాంతంలో లభించే ఖనిజాన్ని మరికొందరు అక్రమ మార్గంలో తరలిస్తున్నారు. అది కూడా సైదాపురం నుంచి రాపూరు, వెంకటగిరి, ఏర్పేడు మార్గం ద్వారా తెలుగుతమ్ముళ్లు బృందాలుగా ఏర్పడి దగ్గర ఉండి చెన్నైకి తరలిస్తున్నారు. కానీ అధికారులు మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

రోజుకు రూ.కోటి వరకు వసూలు..

అక్రమ తరలింపునకు అన్నీ తామై వ్యవహరిస్తున్న తెలుగు తమ్ముళ్లు ఆదాయం వింటే నోరెళ్లబెట్టాల్సిందే. టన్నుకు రూ.5 వేలు నుంచి రూ.8 వేల వరకు, ఒక్క లారీకి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు చొప్పున భారీగా వసూలు చేస్తున్నారు. రోజుకు 50 లారీలు వెళ్తే రోజూ రూ.కోటి చొప్పున ఈ వారంలోనే రూ.7 కోట్లు దండుకున్నట్లు సమాచారం. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ అక్రమ దందాను అరికట్టి కోట్ల రూపాయల విలువ చేసే తెల్లరాయి తరలిపోకుండా చర్యలు తీసుకోవాలని, అక్రమార్కులతో పాటు వారికి సహకరిస్తున్న వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



తరలిపోతున్న ఖనిజ సంపద తెల్లరాయి

జిల్లాలో మైనింగ్‌ల సమాచారం

- కొత్తపాలసీ ప్రకారం మూతబడిన భూగర్భ గనులు 7
- ఓపెన్ క్వార్ట్జ్ మైనింగ్‌లు 130
- సైదాపురంలో ఉన్నవి 60
- కొత్త పాలసీ పేరిట అన్ని గనులు మూసి ఒక గనికే అనుమతి

అనుమతి గోరంత.. అక్రమాలు కొండంత..

మండలంలో కూటమికి ముఖ్య అనుచరులకు అనుమతులు ఇచ్చారు. అయితే ఈ అనుమతులను అడ్డు పెట్టుకుని మండలంలోని జోగిపల్లి, కలిచేడు, తలుపూరు, సైదాపురం, చాగణం, ఊటుకూరు, తురిమెర్ల ప్రాంతాల నుంచి రాత్రుల్లో నిల్వ ఉన్న తెల్లరాయిని అక్రమార్కులు తరలించేస్తున్నారు. పేరుకే మైన్లు నిలిపి వేశామనే చెబుతున్నారు కానీ అన్ని గనుల్లో ఉన్న సరుకును ఇలా అక్రమ మార్గాల్లో తరలిస్తున్నారు.

ఇది నీకు.. అది నాకు

తెల్లరాయి అక్రమ తరలింపులో తిలాపాపం తలాపిడికెడు అన్నట్లు.. పోలీసు, మైనింగ్, రెవెన్యూ శాఖ అధికారులకు ఎప్పటికప్పుడు మామూళ్లు అందుతుండడంతో అక్రమ దందా వైపు కన్నెత్తి చూడడం లేదు. ఎవరైనా తెల్లరాయి తరలింపుపై ఫిర్యాదు చేసినా బుట్ట దాఖలు చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన కొందరు చోటా నాయకులు ఓ బృందంగా ఏర్పడి టన్నుకు రూ.8 నుంచి రూ.10 వేల వరకు వసూలు చేసి అక్రమార్కులకు రాచ మార్గం చూపుతున్నారు. సైదాపురం మండలం నుంచి గత 10 రోజులుగా దాదాపు 15,000 టన్నులకు పైగా తెల్లరాయి సంపదను ఎల్లలు దాటించేశారు. ఆ ఖనిజం విలువ సుమారు రూ.60 కోట్లు ఉంటుందని అంచనా. మరి అక్రమ దందాలో ఇక్కడి చోటా నేతలతో పాటు నియోజకవర్గ అధినాయకులకు, అధికారులకు భారీ స్థాయిలో ముడుపులు ముట్టినట్లు సమాచారం.



రాత్రివేళ లారీల్లో తరలిపోతున్న తెల్లరాయి

కూటమి నేతల బరితెగింపు

సాగునీటి సంఘాల ఎన్నికల్లో పచ్చపార్టీపై 95 శాతం మంది రైతుల వ్యతిరేకత

- అంతటా అధికార పార్టీ నేతలకు తలొగ్గిన అధికారులు
- ఆఖరికి అభ్యర్థులూ కరువైనా అయినా ఆగని ప్రలోభాలు, కుట్రలు
- గిద్దలూరులో ఎన్నికల ప్రక్రియ నిలిపేసిన అధికారులు
- ఎందుకు నిర్వహించలేదో చెప్పాలంటూ తిరగబడిన రైతన్నలు

సైదాపురం : సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి నేతల దౌర్జన్యాలు పరాకాష్టకు చేరాయి. వారికి అధికారులు పూర్తి మద్దతుగా నిలవడంతో బలం లేని ప్రాంతాల్లోనూ తమ వారిని ఏకగ్రీవం చేసుకునేందుకు ప్రయత్నించారు. నామినేషన్ వేసేందుకు అభ్యర్థులు లేకపోయినా కుట్రలు చేశారు. దౌర్జన్యాలకు దిగారు. విషయం తెలుసుకున్న రైతులు ఎదురు తిరిగారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలని పట్టుబట్టారు. 95 శాతం బలం ఉన్న మద్దతుదారులను విజేతలుగా ప్రకటించేందుకు ఇష్టం లేక ఎన్నికలను పూర్తి చేయకుండానే అధికారులు, కూటమి నేతలు వెనుతిరిగారు.

గిద్దలూరులో పరాకాష్ట..

సైదాపురం మండలం గిద్దలూరు సాగునీటి సంఘాలకు శనివారం ఉన్నత పాఠశాలలో ఎన్నికలు నిర్వహించారు. పెద్దచెరువు ఆయకట్టు కింద 223 మంది రైతులు, కొత్తచెరువు ఆయకట్టు కింద 147 మంది రైతులు ఓటర్లుగా ఉన్నారు. గిద్దలూరుకు చెందిన రైతు కంభం విజయభాస్కర్‌రెడ్డి తన అనుచరులతో నామినేషన్లు వేయించారు. అందులో కూడా పెద్దచెరువుకు ఆరుగురు డైరెక్టర్ల స్థానాలకు ఆయన చెప్పిన వారే నామినేషన్ వేశారు. కూటమికి సంబంధించి ఒక్కరూ లేకపోవడంతో నేతలు తలలు పట్టుకున్నారు. కొత్త చెరువుకు ఆరు డైరెక్టర్ల పదవులకు 5 నుంచి 15 మంది రైతులు మాత్రమే కూటమి నేతలకు మద్దతు తెలిపారు. మిగిలిన 132 మంది రైతులు కంభం విజయభాస్కర్‌రెడ్డికి మద్దతుగా నిలవడంతో ఎన్నికలను వాయిదా వేయడానికి టీడీపీ నేతలు ప్రయత్నాలు చేపట్టారు. తమ రైతులకు ఓటు హక్కు ఇవ్వలేదంటూ టీడీపీ నేతలు వాగ్వాదానికి దిగారు. ఎలాంటి అర్హత లేని ఇద్దరు ముగ్గురు చోటా నేతలను రంగంలోకి దించి ఎన్నికలు నిలిపివేసేలా కుట్రలు చేశారు. ఉద్రిక్త పరిస్థితిని సృష్టించారు. దీంతో ఎన్నికల అధికారి అశోక్ కుమార్ ఎన్నికలు నిర్వహించలేకపోతున్నామని తిరుగుముఖం పట్టారు. పెద్దచెరువుకు ఆరుగురు డైరెక్టర్లు నామినేషన్ వేసి అధ్యక్షుడిగా కంభం నిలబెట్టిన అభ్యర్థిని ప్రకటించాల్సి ఉండగా అధికారి అక్కడి నుంచి వెళ్లిపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది.



పోలీసులతో మాట్లాడుతున్న విజయభాస్కర్‌రెడ్డి

రైతుల నిరసన..

ఎన్నికలు నిర్వహించకుండా వెళ్తున్న అధికారిని ఓ వర్గానికి మద్దతుగా నిలిచిన 300 మంది రైతులు నిలదీస్తూ నిరసనకు దిగారు. ఎన్నికల ప్రక్రియ ఎందుకు పూర్తి చేయలేదో రాతపూర్వకంగా తెలపాలని పట్టుబట్టారు. ఇరువర్గాల వివాదం కారణంగా ఎన్నికలు నిర్వహించలేకపోతున్నాం అంటూ ఆయన రాసి ఇవ్వడం కొసమెరుపు. అధికారులు, కూటమి నేతలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా రైతు కంభం విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తమకు 95 శాతం మంది రైతులు మద్దతు పలకడంతో టీడీపీ నేతలు కుట్రలు పన్నారని, కనీసం నామినేషన్ వేయడానికి కూడా అభ్యర్థులు లేక ఎన్నికలను నిలిపి వేయించారని దుయ్యబట్టారు. రెండు సాగునీటి సంఘాల అభ్యర్థులుగా పలువురు రైతులు విజయం సాధిస్తారని తెలుసుకుని టీడీపీ నేతలు అధికారులపై ఒత్తిడి తెచ్చి వాయిదా వేయించడం వారి దమన నీతికి నిదర్శనమన్నారు.



నామినేషన్ వేసిన వారితో కలిసి మీడియాతో మాట్లాడుతున్న విజయభాస్కర్‌రెడ్డి

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 22 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 72,962 మంది స్వామి వారిని దర్శించుకోగా 30,645 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.37 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

చిరస్మరణీయులు అమరజీవి





పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి అర్బన్: భాషా ప్రయుక్త రాష్ట్రాలకు ఆద్యులు అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం బీసీ సంక్షేమ శాఖ నేతృత్వంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మద్రాసులో జన్మించిన అమరజీవి పొట్టి శ్రీరాములు 1952లో ఆయన సుమారు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరులైన తర్వాత అప్పటి ప్రధాని నెహ్రూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ప్రకటించారని తెలిపారు. అంతటి గొప్ప వ్యక్తి గురించి భావితరాలకు తెలియజేయడం ఎంతో అవసరమని సూచించారు. ప్రభుత్వ ఆదేశానుసారం రాష్ట్రవ్యాప్తంగా అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆత్మార్పణ దినంగా నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, బీసీ సంక్షేమ అధికా రి జ్యోత్స్న, సంబంధిత బీసీ సంక్షేమ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

తిరుపతి క్రైం: సామాజిక న్యాయ పోరాటయోధుడు, దేశభక్తుడు పొట్టి శ్రీరాములు వర్ధంతిని జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించారు. ఎస్పీ సుబ్బరాయుడు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించా రు. ఎస్పీ మాట్లాడుతూ మహోన్నత వ్యక్తిత్వం కలిగిన పొట్టి శ్రీరాములు జీవితం మనకు ఆదర్శమన్నారు. సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు రవిమనోహరాచారి, సాయుధదళం శ్రీనివాసులు, డీఎస్పీలు రవీంద్రా రెడ్డి, చిరంజీవి, ఎస్బీసీఐ శ్రీనివాసులు, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేంద్రమంత్రికి సాదర స్వాగతం



స్వాగతం పలుకుతున్న రాష్ట్ర మంత్రి సవిత

రేణిగుంట: కేంద్ర చేనేత, జౌళి శాఖమంత్రి గిరి రాజ్ సింగ్‌కు ఆదివారం రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం విచ్చేసిన ఆయనకు విమానాశ్రయంలో రాష్ట్ర బీసీ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుపతికి బయల్దేరి వెళ్లారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, రాష్ట్ర చేనేత, టెక్స్‌టైల్స్ శాఖ కమిషనర్ రేఖారాణి ఉన్నారు.

సాగునీటి ఎన్నికల్లో రెండు వాయిదా

- 17 తర్వాత వీటికి కొత్త నోటిఫికేషన్
- 44 మంది సభ్యులను ప్రకటించని అధికారులు

తిరుపతి అర్బన్ : జిల్లా వ్యాప్తంగా సాగునీటి ఎన్నికలకు సంబంధించి అధికార పార్టీకి చెందిన నేతలు ఏకగ్రీవంగా తమ అనుచరులకు కట్టబెట్టారు. జిల్లాలో 610 సంఘాలకు సంబంధించి 608 సంఘాలను ఏకగ్రీవం చేశారు. ఏర్పేడు మండలంలోని మన్నసముద్రం చెరువు కమిటీ ఎన్నికలో బీజేపీ, టీడీపీ నేతల మధ్య వివాదాలు నెలకొనడంతో ఆ కమిటీ పెండింగ్‌లో పెట్టారు. అలాగే తొట్టంబేడు మండలంలోని గుండేలు గుంట కమిటీ ఎన్నికకు సంబంధించి టీడీపీ నేతల మధ్య వివాదంతో పెండింగ్ పెట్టారు. ఈ క్రమంలో 608 కమిటీలకు చైర్మన్లను ప్రకటించారు. 607 సంఘాల వైస్ చైర్మన్లను వెల్లడించారు. పిచ్చాటూరు మండలంలోని అరూర్ ఆయకట్టు ఎన్నికలో వైస్ చైర్మన్ పదవిని పెండింగ్‌లో పెట్టారు. మరోవైపు 608 కమిటీలకు చెందిన 44 మంది సభ్యుల ఎంపికను పెండింగ్‌లో ఉంచారు. ఈ కమిటీలను భర్తీ చేయడానికి ఈనెల 17 తర్వాత కొత్త నోటిఫికేషన్ విడుదల చేసి పెండింగ్‌లోని రెండు కమిటీలతో పాటు ఒక ఉపాధ్యక్షుడు, 44 మంది సభ్యులను ఎంపిక చేస్తామని నీటి పారుదల శాఖ జిల్లా అధికారి మదన్‌గోపాల్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే మూలస్తంభాలు

- అధికారంలోకి రాకపోయినా కార్యకర్తల్లో చెదరని ఉత్సాహం
- కూటమి సర్కారు ఇచ్చిన హామీలను నిలదీయాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న భూమన కరుణాకర రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, డాక్టర్ సునీల్‌కుమార్

తవణంపల్లె: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే మూలస్తంభాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలిచి ఆయన నాయకత్వాన్ని బలపరచాలని చిత్తూరు ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని సిద్ధంపల్లె సమీపంలో ఉన్న నారాయణాద్రి కల్యాణ మండపంలో ఆదివారం పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి పార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా స్వాతంత్ర్య సమరయోధుడు పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి ఆయన పూజలు చేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కరుణాకర రెడ్డి ప్రసంగిస్తూ పేదలకు మూడు పూటలా అన్నం పెట్టాలనే సంకల్పంతో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షాన నిలిచారని గుర్తుచేశారు. కానీ అబద్ధపు హామీలతో వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను వంచన చేస్తుందని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలను చంద్రబాబు మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నా అధికారం లేకున్నా, కూటమి నాయకులు దాడులు చేసి తప్పుడు కేసులు బనాయించినా, మనోధైర్యంతో ఉత్సాహంతో సమావేశానికి వచ్చిన కార్యకర్తలను చూస్తే ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. రాజశేఖర్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పేదల కోసం పోరాడే జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబుకు ఇక గడ్డుకాలం

అబద్దాలు చెప్పి గద్దెనెక్కిన చంద్రబాబుకు ఇకముందు గడ్డుకాలం ఉందని చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప చెప్పారు. కార్యకర్తలు సమయమనం పాటించి పార్టీకి అండగా నిలవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. కూటమి నాయకులు సూపర్ సిక్స్ పథకాలు పెట్టి ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి నాయకులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కేసులు బనాయిస్తే కలసికట్టుగా ధైర్యంగా ఎదుర్కోవాలని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమారరాజ, వైఎస్సార్ సీపీ తవణంపల్లె, ఐరాల, పూతలపట్టు, బంగారుపాళెం, యాదమరి మండల అధ్యక్షులు హరిరెడ్డి, బుజ్జిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రామచంద్రారెడ్డి, ధనంజయరెడ్డి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మహిళా కార్యదర్శి గౌహతిరెడ్డి, పార్టీ నాయకులు గాంధీబాబు, రాజారత్నం రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, దత్తాత్రేయరెడ్డి, కిషోర్‌కుమార్ రెడ్డి, సుకేష్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా..

కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఇప్పటికే అసంతృప్తి ఉన్నారని పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. రానున్న కాలంలో కార్యకర్తలు ఐకమత్యంతో ప్రజల పక్షాన నిలవాలని కోరారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తానని స్పష్టం చేశారు. గెలుపు ఓటములు సహజమని రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని జగన్‌మోహరెడ్డికి ప్రజలు పట్టం కడతారని జోస్యం చెప్పారు. జిల్లా అధ్యక్షుడు కరుణాకర రెడ్డి నేతృత్వంలో పార్టీకి పూర్వ వైభవం తేవాలని సూచించారు.



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

జాతీయ స్థాయి వెటరన్ పోటీలకు ఎంపిక



ప్రతిభాపత్రం అందుకుంటున్న వెటరన్ క్రీడాకారుడు మల్లికార్జున్

చిల్లకూరు : బోరు మెకానిక్‌గా పనిచేస్తున్న వెటరన్ క్రీడాకారుడు మల్లికార్జున్ రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో జరిగే వెటరన్ పోటీలకు ఎంపికయ్యాడు. చిల్లకూరుకు చెందిన పోతుగుంట మల్లికార్జున్ ఆదివారం మాట్లాడుతూ.. మనుబోలు మండలంలో బోరు మెకానిక్‌గా పని చేసుకుంటూ ఆటలపై ఉన్న మక్కువతో వెటరన్ క్రీడాపోటీల్లో పాల్గొంటున్నానని చెప్పారు. ఇందులో భాగంగా రాష్ట్ర స్థాయిలో క్రిష్ణా జిల్లా గుడివాడలోని ఎన్టీఆర్ స్టేడియంలో 14,15 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి రెండో స్థానంలో నిలవడంతో 2025 ఫిబ్రవరి 6,7 తేదీల్లో రాజస్థాన్‌లోని ఆల్వారాలో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో విజేతగా నిలిచినందుకు విజయనగరం ఎమ్మెల్సీ రఘురాజు, ఏపీ టూరిజం డైరెక్టర్ ఇందుకూరి సుబ్బలక్ష్మి చేతుల మీదుగా సర్టిఫికెట్లు , బహుమతులు అందుకున్నట్లు తెలిపారు.

అత్యాధునిక వైద్యం అందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్

తిరుపతి తుడా: రోగులకు నూతన విధానాలతో అత్యాధునిక వైద్యం అందించడమే లక్ష్యం కావాలని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీపీ చంద్రశేఖరన్ తెలిపారు. ఆదివారం రుయా ఆస్పత్రి జనరల్ మెడిసిన్ విభాగంలో నిరంతర వైద్య విద్య కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైద్యులు, పీజీ విద్యార్థులు వైద్యరంగంలో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకుని నాణ్యమైన వైద్యాన్ని రోగులకు అందించాల్సి అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అనే అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రుయా సూపరింటెండెంట్ రవిప్రభు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మూర్తి, డాక్టర్ సురేష్, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ వరుణ్, అపర్ణరెడ్డి, చిత్తూరు అపోలో, స్విమ్స్, కుప్పం పీఈఎస్, వైఎస్సాఆర్ కడప జీఎంహెచ్ ఆసుపత్రుల ప్రతినిధులు హాజరయ్యారు.

టీటీడీ సంస్థల తైక్వాండో కోచ్‌కు పురస్కారం



అవార్డు అందుకుంటున్న కోచ్ గోపీ

తిరుపతి సిటీ : టీటీడీ సీనియర్ అసిస్టెంట్, ఆ విద్యా సంస్థల తైక్వాండో కోచ్ మాస్టర్ కొమ్మినేని గోపి నాయుడుకు అరుదైన గౌరవం లభించింది. బెంగళూరు వేదికగా ఆదివారం జేపీ పార్క్ కప్- 2024 ఓపెన్ నేషనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఇందులో భాగంగా తిరుపతికి చెందిన మాస్టర్ కొమ్మినేని గోపి నాయుడు తైక్వాండో కోచ్‌గా ఉత్తమ క్రీడాకారులను తయారు చేయడంలో ఆయన కృషికి గుర్తింపుగా పోటీల ఆర్గనైజర్ పెంచలయ్య క్రీడారత్న అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా టీటీడీ ఉద్యోగులు, క్రీడాకారులు ఆయనను అభినందించారు.

పురుడు ఫంక్షన్‌కు వెళ్తూ..

- కారు ఢీకొని మహిళ మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గోవిందమ్మ

తిరుపతి రూరల్: బంధువుల ఇంట్లో పురుడు ఫంక్షన్‌కు వెళ్తూ వేగంగా వచ్చిన కారు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ ఎస్కే మూర్తి తెలిపిన వివరాల మేరకు.. నగరి మండలం మాంగాడుకు చెందిన గోవిందమ్మ(48), తన కుమారుడు భానుప్రకాష్, సమీప బంధువు కిరణ్‌తో కలిసి చంద్రగిరి మండలం పిచ్చినాయుడుపల్లిలో బంధువుల ఇంట్లో పురుడు ఫంక్షన్‌కు స్కూటర్‌లో వెళ్తున్నారు. పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై వకుళామాత ఆలయం సర్కిల్ వద్ద పేరూరు పంచాయతీలో నుంచి వేగంగా బైపాస్ పైకి దూసుకొచ్చిన గుర్తు తెలియని కారు గోవిందమ్మ ప్రయాణిస్తున్న స్కూటర్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో గోవిందమ్మ స్కూటర్‌పై నుంచి కింద పడి తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. స్కూటర్ నడుపుతున్న కిరణ్, మృతురాలి కుమారుడు భానుప్రకాష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలాన్ని తిరుపతి రూరల్ ఎస్ఐ ఎస్కే మూర్తి పరిశీలించారు. కేసు నమోదు విచారిస్తున్నట్లు ఎస్ఐ మూర్తి తెలిపారు.

వారపు సంతలో గుత్తేదారు దౌర్జన్యం

- అడిగినంత సొమ్ము ఇవ్వకపోతే భౌతిక దాడులు
- ఓ రైతును చితకబాదిన కూటమి ప్రభుత్వ గుత్తేదారుడు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు



ఆస్పత్రి పాలైన భర్తను చూసి కన్నీటి పర్యంతమవుతున్న బాధితుడి భార్య

చంద్రగిరి: కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి చంద్రగిరి నియోజకవర్గంలో దాడులు నిత్యకృత్యమయ్యాయి. ఇన్నాళ్లూ వ్యాపారస్తులు, ప్రతిపక్ష పార్టీ నాయకులపైనే దాడులు జరిగాయి. ఇప్పుడు అన్నదాతలపైనా దాడులకు తెగబడుతున్నారు. ఆదివారం రాత్రి చంద్రగిరి వారపు సంతలో ఓ రైతుపై కూటమి ప్రభుత్వానికి చెందిన గుత్తేదారుడు దాడి చేసిన ఘటన కలకలం సృష్టించింది. బాధిత రైతు వివరాల మేరకు.. రామచంద్రాపురం మండలం బొప్పరాజుపల్లికి చెందిన రైతు చెంగల్రాయలు ప్రతివారం చంద్రగిరి వారపు సంతలో తాను పండించిన కూరగాయలను విక్రయించుకుంటాడు. అయితే అధికార పార్టీకి చెందిన కొంతమంది నేతలు ఇటీవల వారపు సంతను వేలంపాటలో సొంతం చేసుకున్నారు. ఈ క్రమంలో కొందరు ఆదివారం చెంగల్రాయలు వద్దకు చేరుకుని రూ.500 గేటు రుసుము చెల్లించాలన్నారు. అయితే వ్యాపారం చాలా తక్కువగా జరిగిందని, అంత ఇచ్చుకోలేమని, తాము గతంలో రూ.100 ఇచ్చేవారమని, ప్రస్తుతం రూ.200 వరకు ఇస్తామని చెప్పారు. గుత్తేదారుడు రైతు భార్య హరిణితో వాగ్వాదానికి దిగడంతో రైతు చెంగల్రాయలు తన ఫోన్‌లో చిత్రీకరించడడంతో ఒక్కసారిగా తీవ్ర ఆగ్రహానికి లోనయ్యాడు. రైతుపై పిడుగుద్దులు గుద్దుతూ, గోడకేసి కొట్టగా తలకు బలమైన గాయమైంది. తోటి రైతులు స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అధిక రుసుము చెల్లించుకోలేమని చెప్పినందుకే తన భర్తపై గుత్తేదారుడు దాడి చేశాడంటూ బాధిత రైతు భార్య హరిణి ఆవేదన వ్యక్తం చేసింది.

చోద్యం చూస్తున్న అధికారులు..

వారపు సంతలో ప్రతి వారం రైతులపై దౌర్జన్యాలు, దాడులు, బూతు పురాణాలతో గుత్తేదారులు హడలెత్తిస్తున్నా పంచాయతీ అధికారులు, పోలీసు అధికారులు చోద్యం చూస్తుండడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుత్తేదారులపై చర్యలు తీసుకోకపోతే, వారపు సంతను బహిష్కరించడంతో పాటు రోడ్డెక్కి నిరసనకు దిగుతామంటూ హెచ్చరిస్తున్నారు. గతంలో ఎన్నడూ రైతులపై ఇలా దాడులు జరిగిన దాఖలాలు లేవని, ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికే మూడుసార్లు అన్నదాతలపై భౌతిక దాడులు జరగడం సిగ్గుచేటన్నారు.

రైతుకు మోహిత్‌రెడ్డి పరామర్శ

వారపుసంత గుత్తేదారుడి చేతిలో గాయపడిన రైతు చెంగల్రాయున్ని చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు.

చిన్నారితో అసభ్యకర ప్రవర్తన

పెళ్లకూరు: మండలంలోని నెలబల్లి గ్రామానికి చెందిన ఓ చిన్నారి పట్ల అదే ప్రాంతానికి చెందిన సుధాకర్ అనే వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించడంపై బాలిక తల్లిదండ్రులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మూడు రోజుల కిందట గ్రామంలోని దళితకాలనీకి చెందిన ఓ చిన్నారి ఒంటరిగా ఉన్న సమయంలో అదే ప్రాంతానికి చెందిన సుధాకర్ అసభ్యకరంగా ప్రవర్తిస్తుండగా స్థానికులు గుర్తించి మందలించారు. జరిగిన విషయం చిన్నారి తల్లిదండ్రులకు తెలియడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఘటనపై నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, స్థానిక ఎస్ఐ నాగరాజు గ్రామానికి చేరుకుని పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు.

వ్యభిచార గృహంపై దాడి

తిరుపతి క్రైం : నగరంలోని భవానీనగర్‌లో ఓ నివాసంలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో ఈస్ట్ పోలీసులు మెరుపు దాడులు చేసి అరెస్ట్ చేసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు... భవానీనగర్‌లోని ఓ ఇంటి గ్రౌండ్ ఫ్లోర్‌లో వ్యభిచారం జరుగుతున్నట్లు సమాచారం వచ్చి దాడులు చేశారు. బుజ్జమ్మ, శారద, సుబ్రహ్మణ్యం ముగ్గురూ కలిసి వ్యభిచార గృహం నిర్వహిస్తూ కోస్తా నుంచి అమ్మాయిలను పిలిపించేవారు. వీరిని యువకులకు ఎరవేసి వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసేవారు. ఈ మేరకు నిందితులు ముగ్గురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 1000 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఓ మహిళను గుర్తించి ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించామన్నారు.

హవ్వా.. ఇంత ప్రచార యావ ?



ఈ ఏడాది ఫిబ్రవరి 28న నూతన ఎంపీడీఓ కార్యాలయ భవన నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మాజీ తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి(ఫైల్)

- చేసిన పనికే మళ్లీ భూమిపూజ..!



అదే ప్రాంతంలో ఎంపీడీఓ కార్యాలయ నిర్మాణానికి మరోసారి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నాని

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేస్తున్నామంటూ ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రచారాలకే తన సమయమంతా కేటాయిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రోడ్లు, తమ ప్రభుత్వం హయాంలోనే వేశామంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఇప్పుడు స్థానిక ఎంపీడీఓ నూతన భవనానికి మంజూరైన పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేసి, ఇప్పుడు తామే ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చి భవన నిర్మాణం కడుతున్నట్లు హడావుడి చేయడంపై చంద్రగిరి ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో రూ.90 లక్షల కేటాయింపు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నూతన ఎంపీడీఓ భవన నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కృషితో రూ.90 లక్షల తుడా నిధులను మంజూరు చేశారు. ఆపై ఫిబ్రవరి 28వ తేదీన పాత ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులను రద్దు చేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని ఎంపీడీఓ భవన నిర్మాణాన్ని నూతనంగా మరోసారి మంజూరు చేయించారు. ఆపై తన పరివారంతో కలిసి ఆదివారం భూమిపూజ చేశారు.

వేడుకగా మహా చండీహోమం



మహా చండీహోమంలో పూర్ణాహుతి చేపడుతున్న ఆలయ అర్చకులు

తిరుపతి కల్చరల్: పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఆదివారం మహా చండీహోమం అత్యంత వేడుకగా జరిగింది. ఇందులో భాగంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని ఆలయ ఆవరణలోని యాగ మండపానికి వేంచేపు చేసి అక్కడ అర్చకులు శాస్త్రోక్తంగా మహా చండీ హోమం చేపట్టారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన మహా చండీహోమం 11.45 గంటలకు చేపట్టిన పూర్ణాహుతితో హోమం పరిసమాప్తమైంది. ఇందులో పాల్గొన్న భక్తులకు అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

గంగమ్మ ఆలయానికి రూ.1,01,116 విరాళం

శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి తిరుచానూరుకు చెందిన బైలుప్పల ప్రసాద్, సూర్యనారాయణమ్మ ఆదివారం రూ.1,01,1116 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ ఈఓ జయ కుమార్‌కు అందజేసి, ఈ సొమ్మును ఆలయ నిర్మాణానికి వినియోగించాలని కోరారు.

బహిరంగ వేలంతో పనుల అప్పగింత..

శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో వివిధ పనులను ఏడాది పాటు లీజు హక్కు కల్పిస్తూ నిర్వహించిన బహిరంగ వేలం నిర్వహించి అప్పగించారు. ఈమేరకు అమ్మవారికి సమర్పించే చీరలు, రవిక పీసుల సేకరణ లీజు హక్కుకు సంబంధించి రూ.22,05,000, కొబ్బరి చిప్పల సేకరణ లీజు హక్కు రూ.3,69,000కు అప్పగించినట్లు ఆలయ ఈఓ జయకుమార్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR

■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry.9381287629

Real Estate

■ తిరుపతి, రామచంద్రాపురం దగ్గర తక్షణ గృహ నిర్మాణానికి అనువైన తుడ అప్రూవల్ ప్లాట్స్ 41 అం.లు కేవలం రూ. 15,45,000 మాత్రమే. ✆ 99660 66111.

Wanted

■ తిరుపతిలో ప్రముఖ సంస్థ నందు పని చేయుటకు అనుభవజ్ఞులైన Tele Callers కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. ✆ 9100445334, 9676737633.

■ ఆఫీస్‌బాయ్, ప్యాకింగ్ హెల్పర్, సెక్యూరిటీ గార్డ్స్ జీ:11,000, హౌస్‌కీపింగ్, ఫీల్డ్‌ఆఫీసర్ జీ:10,000 4WO, PF, ESI, బజాజ్ ఎలక్ట్రానిక్స్, తిరుపతి, సూళ్లూరుపేటలో కావలెను. 9989139239, 8179196300.

■ ప్రముఖ సంస్థలో పనిచేయుటకు అనుభవం కల్గిన బోర్‌వెల్ ఆపరేటర్స్ కావలెను. కావలసినవారు సంప్రదించండి: 9966608822, 9533333613.

■ ఆఫీస్ బాయ్, వెయిట్ లిఫ్టింగ్, సెక్యూరిటీ గార్డ్, ఫీల్డ్ ఆఫీసర్, హౌస్ కీపింగ్ &జీ:11,000, 4WO, PF, ESI తిరుపతి, సూళ్లూరుపేట, కాళహస్తి, పుత్తూరు బజాజ్ ఎలక్ట్రానిక్ షోరూం. 9989139239, 9908042107.

■ ప్రముఖ యూనివర్శిటీ నందు అవుట్ సోర్సింగ్‌లో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్‌లు (జీ: 28,000), Attender(జీ: 18,500) కావలెను. 9848771117, 9949942245.

■ వైభవ్ హోటల్, రేణిగుంట నందు పనిచేయుటకు లాడ్జి మేనేజర్, క్యాషియర్ మరియు సెక్యూరిటీ కావలెను. సంప్రదించండి సెల్: 9440109401.

■ Wanted Senior Accountant Minimum Experience 5 Years. Email: megamedicals.ceo@ gmail.com

■ ఉద్యోగ అవకాశం కోసం ఎదురు చూస్తున్నారా మా MNC కంపెనీలో వర్క్‌ఫ్రంహోం సదుపాయంతో స్త్రీ పురుషులు కావలెను. Qul:-10th, డిగ్రీ మంచి జీతం ఉచిత రూములో వసతి సదుపాయం.9018041491, 9110475888

■ శ్రీ వెంకటేశ్వర ఎంటర్‌ప్రైజెస్‌లో వర్క్ చేయుటకు యువతీ/యువకులు కావలెను. రికార్డ్ రాయుటకు, టెలికాలర్, డేటాఎంట్రీ, జీతం: 18K, వీక్లీ పేమెంట్ సంప్ర: 9866426843.

■ ప్రముఖ Enovizen సంస్థ యందు ఉద్యోగాలు కలవు. రిసెప్షనిస్ట్, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. వెంటనే సంప్రదించండి: 85151 30414, 85813 48792, 96668 48880

■ అస్త హోమ్ కేర్ హైదరాబాద్ ఫీమేల్ కేర్ టేకర్స్ మాత్రమే కావలెను. జీతం 18-20వేలు, సంవత్సరం లోపు 22-25వే పెరిగే అవకాశం. వయస్సు 20-45లోపు ఉచిత భోజన వసతి. 7680922316

■ Universal యాప్స్ కంపెనీకి మొబైల్‌లో SMSలు పంపుతూ వారానికి 5000 నుండి 6000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418.

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషేంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్ జీ: 18K. Ph: 9640400073, 9160900024

■ మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3,500 సంపాదించుకోండి. వివరాలకు వాట్సాప్‌లో Hi అని మెసేజ్‌చేసి కాల్ చేయండి. 82478 08801.

■ కష్టలక్ష్మీ కాకు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు, ఫ్రీ రూం+భోజనం. HYD. 8919613984

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పరిశీలించి పెదవ ప్రక్రియించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వాణిజ్యేతర ప్రకటనకు రూ. 375/- ప్రతి ప్రకటనపై అదనపు లైనుకు రూ.:90/- G.S.T 5% అదనం

CONTACT : 9440166091, 9951602970

